# పొల్లు

ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునేప్పుడు జీవితాన్ని చాలా తేలికగా తీసుకునేవాడిని. కావలసిన దానికన్నా నాన్న ఎక్కువ డబ్బులే పంపించేవాడు. దేనికీ కొదవ ఉండేదికాదు. పేరుకుమటుకే హాస్టలులో ఉండడం. ఎక్కువ రోజుల్లో యూనివర్సిటీ బయట గదుల్లో అద్దెకు తీసుకుని ఉండే స్నేహితుల గదుల్లో గడిపేస్తుండేవాడిని. చేతుల్లో మోటారు బయికులు ఉండేవి. సినిమాల కేమిటి, పిక్‌నిక్ స్పాటుల కేమిటి, ఎక్కడకంటే అక్కడకు వెళ్ళిపోతూ ఉండేవాళ్ళం. హాస్టలులో స్వేచ్ఛ అట్టే ఉండేది కాదు. అప్పుడప్పుడు వెళ్తూండేవాడిని. మా గదిలో నా మంచం మీద మరెవరో పడుకుని ఉండేవారు. నా గది నాకే కొత్తగా అనిపించేది. ఏం చేసేవాళ్లో ఏమో నా తరుపున ఉండేవాళ్ళే నా మెస్ బిల్లులు కట్టేస్తుండేవారు.

ఈ ఊళ్ళో మా బంధువులు ఉన్నారు. అమ్మా నాన్న ఫోను చేసినప్పుడల్లా 'పిన్ని వాళ్ళింటికి గాని, మామయ్య వాళ్ళింటికి గాని చిన్నాయని వాళ్ళింటికి గాని వెళ్ళి వచ్చావ్రా?' అని అడుగుతూ ఉండేవారు. 'వెళ్తాను. వచ్చే అదివారం తప్పకుండా వెళ్తాను' అనేవాడివి. వెళ్ళడానికి సమయం చిక్కేదికాదు.

చివరి సెమిస్టరులో కేంపస్ సెలక్షన్స్‌లో నాతో పాటు మరో నలుగురికి అవకాశం వచ్చింది. . నేను ఊహించని విషయం. దాని వలన నాకు లాభం చేకూరినా స్నేహితులకు దూరమయ్యాను. అప్పటివరకు ఎంతో సన్నిహితంగా మెలిగిన స్నేహితులు మెల్ల మెల్లగా దూరమయి మునుపటిలా కాకుండా మాట్లాడడం మానేశారు. బాధపడే వాడిని.

నాతోపాటు ఎన్నికయిన వాళ్ళలో ఇద్దరు అమెరికా వెళ్ళిపోయారు. ఒకతను సివిల్స్ రాసి ఐ.ఎ.ఎస్.కు సెలక్టయి ట్రయినింగు పూర్తి అయ్యాక కేరళ కేడరులో చేరి ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకోతను మాక్లాసు అమ్మాయినే ప్రేమించి, విఫలుడయి పురుగులమందు తాగి చనిపోయాడు. ఆమె చాలా అందంగా ఉండేది. మా వాడు కాక నాకు తెలిసి మరో ఇద్దరు కూడా ఆమె ప్రేమలో పడ్డారు. కాని పురుగులమందు

బి.పి.కరుణాకర్

వరకు వెళ్ళలేదు. జీవితమంతా అందంగా ఉండాలనేమో ఆమె ఇంతవరకు పెళ్ళి చేసుకోలేదు. ఇంజనీరింగ్ పూర్తి చేయలేదు.

ఇప్పుడు నా వయసు ముప్పయి రెండు సంవత్సరాలు. పెళ్ళి చేసుకుందామని పది సంబంధాలు పయిగా చూశాను. చూసినవన్నీ నా మటుకు నాకు బావున్నట్టే అనిపించాయి. మెలిక ఎక్కడ పడేదో తెలిసేది కాదు. ఏదీ కుదిరేది కాదు. నేను అందగాడినేం కాదు. ఒడ్డూ పొడుగూ ఉన్న వాడినీ కాదు. తలమీది జుట్టు మెల్లగా పలుచపడుతోంది. మరో మూడు నాలుగు సంవత్సరాలకు బట్టతలకు లోనవుతానేమో అనిపిస్తోంది. ఏ అమ్మాయినో ప్రేమించి పెళ్లి చేసుకోవచ్చు. అయితే అదంత తేలికయిన విషయం కాదు. ప్రేమ అనుకోగానే పురుగులమందు తాగి చనిపోయిన స్నేహితుడు గుర్తు వస్తాడు. ప్రేమించడం మాట డీప్ ఫ్రిజ్‌లోకి వెళ్ళిపోయింది. నా ప్రాజెక్టులో పనిచేస్తున్న అమ్మాయిల కళ్ళల్లో కళ్ళు పెట్టి మాట్లాడడానికి భయం వేస్తుంటుంది. అమ్మాయిలంటే ఆసక్తి లేదని కాదు. పురుగుల మందు తాగి చనిపోయిన నా స్నేహితుడిలా అమ్మాయిలతో మాట్లాడడం చాతకాదు.

నా పెళ్ళి విషయమయి మా వాళ్ళకు విసుగు కలిగో, ఏమో పట్టించుకోవడం మానేశారు. నా తర్వాత వాడికి, చెల్లెలకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. నా పెళ్ళి కూడా అయిపోతే మిగతా సంగతులు అటుంచి వంట చేసుకునే బాధ తప్పుతుంది.

ముందు కారు కొన్నాను. తర్వాత అపార్టుమెంటు కొన్నాను. సంసారానికి అవసరమయిన అన్ని వస్తువులూ కొనుక్కున్నాను. నేనుండే చోటుకు మా ఆఫీసు నలభయి కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉదయం సరిగ్గా ఏడున్నరకు నల్లకుంటలో నిలబడితేనే మా కంపెనీ బస్సు దొరుకుతుంది. రెండు నిమిషాలు ఆలస్యం అయినా తప్పిపోయినట్టే. అది తప్పితే అంత దూరం నా కారులో వెళ్లాల్సి వస్తుంది. హైవేలో కారులో వెళ్ళడానికి భయపడుతుంటాను. అలా వెళ్ళడానికి ప్రయత్నించిన ప్రతిసారి కారు చిన్న చిన్న ప్రమాదాలకు గురి అయింది.

మా ఆఫీసు ఎనిమిదన్నరకు మొదలవుతుంది. తిరిగి రావడం నా చేతిలో ఉండదు. రాత్రి పది కావచ్చు. పన్నెండు కావచ్చు. అప్పుడప్పుడు ఒంటిగంట దాటుతుంది. తిరిగి వచ్చేప్పుడు ఆఫీసు కారు ఇస్తారు. ఆఫీసు పనిలో నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. రాన్రాను వంట విషయంలోనే ఇబ్బంది ఎక్కువవుతోంది. నాకు వంట వచ్చు. ఏ అర్ధరాత్రో, అపర్రాత్రో వంట చేసుకోవడం కుదరడం లేదు.

ఆఫీసులో, బిస్కట్లతో, సాండ్‌విచ్‌లతో, చల్లటి పానీయాలతో కడుపు నిండదు. రాత్రి ఎనిమిది దాటితే కేంటీన్ మూసేస్తారు. తిరిగి వచ్చే సమయం బాగా ఆలస్యం అయినప్పుడు బయట ఏ హోటలూ తెరిచి ఉండదు.

ఉదయం ఆఫీసుకు బయల్దేరే సమయానికి నాకు ఎదురయ్యే సమస్య ఇంటి తాళాలు వెంటనే కనిపించక పోవడం. అంతకు ముందు రాత్రి నిద్రమత్తులో ఎక్కడ పెడతానో గుర్తుండదు. తాళాల గుత్తి తలుపుకే ఉంచి ఇంట్లోకి వచ్చేసి తలుపు గడియ వేసుకున్న రోజులు లేకపోలేదు. లోపలకు వచ్చాక తాళాలు ఏ సోఫాలోనో, స్నానాల గదిలోనో, టి.వి., ఫ్రిజ్ మీదో, నా పంట్లాం జేబులోనో పెట్టుకుని, మర్చిపోయి ఇల్లంతా వెతుకుతూంటాను. ఆఫీసులోని పని వత్తిడికి మతిమరుపుకు లోనవుతున్నానేమో అనిపిస్తోంది. డాక్టరును కలుద్దామనుకుంటూనే మర్చిపోతున్నాను. నేను ఊహించుకున్న జీవితం ఒకటి. జరుగుతోంది మరొకటి. మరో కంపెనీకి దూకుదామంటే అన్నీ దాదాపు ఇలానే ఉన్నాయి.

ఆ మధ్య చైనా వెళ్ళినప్పుడు చిన్న ఎలక్ట్రానిక్ కుక్కపిల్ల బొమ్మను తెచ్చుకున్నాను. చేతిబొటనవేలి కణుపంత ఉండి బటన్‌సెల్‌తో పనిచేస్తుంది. దాన్ని తాళాలగుత్తికి తగిలించాను. దాని వలన ఉపయోగం ఏమిటంటే తాళాల గుత్తి ఎక్కడపెట్టి మరచిపోయినా నోటితో ఈల వేస్తే ఇంట్లో ఎక్కడ ఉన్నా అందుకునే వరకు 'భౌ భౌ' అంటూనే ఉంటుంది.

దానితో నా సమస్య తీరి పోయిందనే అనుకున్నాను. అసలు విషయం ఏమిటంటే నోటితో ఈల వేయడం నాకు చాతకాదు. విజిల్‌తో అది పని చేయదు. నా సమస్య మళ్ళీ నా ఎదుటికి వచ్చింది.

* **పాలపిట్ట, మాసపత్రిక, ఆగస్టు 2010**

*(ఎప్పుడో చదివిన ఒక ఆంగ్ల కథ గుర్తుకొస్తోంటే..)*